నమస్తే తెలంగాణ



## సీపీఎస్ఈయూ కార్యదర్శిగా లచ్చిరాం



హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (సీపీఎస్ఈయూ) రాష్ట్ర కార్యదర్శిగా ఉదావత్ లచ్చిరాం నియమితులయ్యారు. నల్లగొండ జిల్లాకు చెందిన లచ్చిరాం మర్రిగూడ మండలంలోని దామెన భీమనపల్లిలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నా రు. సీపీఎస్ రద్దుకు లచ్చిరాం చేస్తున్న పోరాటాన్ని గుర్తించిన సంఘం ఆయన్ను రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్‌కు లచ్చిరాం కృతజ్ఞతలు తెలిపారు.




## సింగరేణికి ప్రతిష్ఠాత్మక అవార్డు

- మెరుగైన సేవలను గుర్తించిన ఎనర్షియా ఫౌండేషన్
- 20న విశాఖలో ప్రదానం

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : పర్యావరణహిత, మైనిం గ్, సోలార్ విద్యుత్తు రంగంలో మెరుగైన సేవలందిస్తున్న సింగరేణి సంస్థ మరో ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపికైంది. దేశంలోనే అత్యుత్తమ మైనింగ్ కంపెనీగా ఎనర్షియా ఫౌండేషన్ అవార్డును అందుకోనున్నది. 2024 సంవత్సరానికి 'ఇండియాస్ బెస్ట్ అండ్ మోస్ట్ సస్టెయినబుల్ కోల్ మైనింగ్ ఆపరేటర్ విత్ రెన్యూవబుల్ ఎనర్జీ అడాప్షన్' కేటగిరిలో సింగరేణిని అత్యుత్తమ సంస్థగా ఎంపికచేశారు. ఈ నెల 20న విశాఖపట్నంలో ఈ అవార్డును నిర్వాహకులు అందజేయనున్నారు. సింగరేణివ్యాప్తం గా ఆరు కోట్లపైగా మొక్కలు నాటడంతోపాటు, పంప్డ్‌స్టోరేజీ, ఫ్లోటిం గ్ సోలార్ ప్లాంట్, కార్బన్‌డయాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీ వంటి పర్యావరణహిత చర్యలను సింగరేణి తీసుకుంటున్నది. దీంతో సంస్థను ఈ అవార్డు వరించింది. అవార్డుకు ఎంపికవ్వటంపై సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం హర్షం వ్యక్తంచేశారు.



ధరూర్ వద్ద ఎమ్మెల్సీ కవిత ప్రసంగం వింటున్న ప్రజలు, మహిళలు



జగిత్యాలలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న కవిత

# కాంగ్రెస్ తల్లిని అంగీకరించం

**ఊరూరా ఉద్యమ తల్లినే ప్రతిష్ఠిస్తం • విగ్రహంలో బతుకమ్మను కాపాడుకుంటం**

**జీవోలు, కేసులతో భయ పెట్టలేరు**

- తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రెస్ సర్కార్ దాడిని గ్రామగ్రామాన ఎండగడుతం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- ధరూర్‌లో 22 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ

జగిత్యాల, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): జీవోలు, కేసులతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ భయ పెట్టలేరని తెలంగాణ జాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టంచేశారు. జగిత్యాల రూరల్ మండలం ధరూర్ శివారులో 22 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆదివారం ఆమె భూమిపూజ చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఉద్యమకాలంలో ప్రజల్లో ఉత్సాహం, ధైర్యం, స్ఫూర్తిని రగిలించి రక్షగా నిలిచిన ఉద్యమ తెలంగాణ తల్లిని కాదని, ఆమె చేతిలో ఉన్న బతుకమ్మను లేకుండా చేసి సీఎం రేవంత్ తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సెక్రటేరియట్‌లో ప్రతిష్ఠించిన విగ్రహాన్ని తెలంగాణ తల్లిగా సమాజం అంగీకరించే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. తెలంగాణ ఉద్యమం, తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం చేస్తున్న దాడిని గ్రామగ్రామాన ఎండగడుతామని చెప్పారు. ప్రభుత్వ గెజిట్‌ను పట్టించుకోబోమని, 22 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి తీరుమని స్పష్టంచేశారు.

> *తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో ఎన్ని జీవోలు, ఎన్ని గెజిట్‌లు ఇచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా తెలంగాణ సమాజం భయపడబోదు. ఉద్యమకాలంలో ప్రజల్లో స్ఫూర్తి రగిలించిన తెలంగాణ తల్లి విగ్రహాలను పల్లెపల్లెనా ప్రతిష్ఠిస్తం.*
> - ఎమ్మెల్సీ కవిత

### ఒక్కో మహిళకు సీఎం రూ.30వేల బాకీ

'జగిత్యాలకు రావడానికి పెద్ద కారణమే ఉన్నది. కాంగ్రెస్, సీఎం రేవంత్‌కు తెలంగాణ తల్లి, తెలంగాణ బతుకమ్మ వద్దట.. వాటిని లేకుండా చేయాలని కుట్ర చేస్తున్నరు. ఈ కుట్రలను ప్రజలకు వివరించి చెప్పేందుకే ఇక్కడికి వచ్చిన' అని కవిత పేర్కొన్నారు. 'తెలంగాణ మహిళలకు తల్లి లేకుండా, బతుకమ్మనే లేకుండ చేస్తున్న సీఎం కనీసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలనైనా అమలు చేస్తున్నాడా అంటే అదీలేదు! మహిళలకు మహాలక్ష్మి పథకం వస్తున్నదా? ఒక్కో ఆడబిడ్డకు నెలకు రూ.2500 వస్తున్నాయా?' అని ప్రశ్నించారు. ఒక్కో మహిళకు రేవంత్‌రెడ్డి రూ.30 వేలు బాకీ పడ్డారని చెప్పారు. వృద్ధులకు నెలకు 4 వేల పెన్షన్ ఇస్తున్నాడా ? అని నిలదీశారు. వృద్ధులకు నెలకు 2వేల చొప్పున సైతం బాకీ పడ్డాడని, దివ్యాంగులకు నెలకు 6 వేల పెన్షన్ ఇస్తానని చెప్పి ఇవ్వడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, తెలంగాణ అస్తిత్వంపై జరుగుతున్న దాడిపై బీఆర్‌ఎస్ తరఫున అసెంబ్లీలో నిలదీస్తామని చెప్పారు.

### కార్యకర్తలను కాపాడుకుంటాం

జగిత్యాల నుంచి గెలిచిన ఎమ్మెల్యే సంజయ్ అసెంబ్లీ సమావేశాలకు ఏ ముఖం పెట్టుకొని పోతారో ప్రజలకు చెప్పాలని కవిత నిలదీశారు. కేసీఆర్ బొమ్మ పెట్టుకొని గెలిచిన ఆయన ప్రజలను వదిలిపెట్టిపోయడని, పార్టీ ఎందుకు మారారని అడిగితే పైసల కోసం మారానని చెప్తున్నారని, ప్రజలను వదిలి పైసల వెంట పడే వారు ఏనాటికీ నాయకులు కాలేరని చెప్పారు. పార్టీకి కొందరు ఎమ్మెల్యేలు ద్రోహం చేసి పోయినా, ప్రజలు, కార్యకర్తలు, నాయకులు మాత్రం పార్టీ వెంటే ఉన్నారని చెప్పారు. కార్యకర్తలు, నాయకులు, భయపడాల్సిన అవసరం లేదని, అందరినీ కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు.

### కస్తూర్బాల్లోనూ కామన్ డైట్ మెనూ పాటించాలి

కస్తూర్బా పాఠశాలల్లోనూ కామన్ డైట్ మెనూను పాటించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి భూమిపూజ అనంతరం జగిత్యాలకు చేరుకున్న ఆమె, కొత్తబస్టాండ్ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆ తర్వాత సారంగాపూర్‌లోని కస్తూర్బా రెసిడెన్షియల్ పాఠశాలకు చేరుకున్నారు. ఇక్కడ ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు పెరిగిపోయాయని విమర్శించారు. ఏడాదిలోనే 49 మంది చిన్నారులు విద్యాసంస్థల్లో చనిపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ పోరాటంతోనే ప్రభుత్వం దిగివచ్చి గురుకులాల్లో మెనూను మార్చివేసిందని చెప్పారు. కామన్ డైట్ మెనూను రూపొందించడంతో పాటు, వాటికి నిధులు కూడా పెంచిందని తెలిపారు. కస్తూర్బా పాఠశాలలను కామన్ డైట్ పరిధిలోకి తేకపోవడం సరికాదన్నారు. అంతకు ముందు ధరూర్ శివారులో మహిళలతో కలిసి కవిత ఉత్సాహంగా బతుకమ్మ ఆడిపాడారు. కార్యక్రమాల అనంతరం కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయిన బీఆర్‌ఎస్ నాయకుడు సృజన్‌రావు కుటుంబ సభ్యులను మేడిపల్లిలో కవిత పరామర్శించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు దావ సురేశ్, మాజీ జడ్పీటీసీ రమ్మోహన్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ప్రియాంక ప్రవీణ్, కౌన్సిలర్లు దేవేందర్ నాయక్, కేసరి బాబు పాల్గొన్నారు.

> *తెలంగాణ తల్లి కేవలం ఒక్క కేసీఆర్ సృష్టి కాదు. అది సకల జనులు సమ్మిళితంగా రూపొందించుకున్న పవిత్రభావానికి ప్రతిరూపం. తెలంగాణ అంటేనే బతుకమ్మ.. తెలంగాణ అస్తిత్వం బతుకమ్మ. తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మను కాపాడుకుంటం.*
> - ఎమ్మెల్సీ కవిత

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 4.7°c | 28.3°c |
| మెదక్ | 8.0°c | 32.1°c |
| రంగారెడ్డి | 8.2°c | 33.2°c |
| హైదరాబాద్ | 11.0°c | 29.2°c |
| నిజామాబాద్ | 12.0°c | 30.9°c |
| కరీంనగర్ | 12.0°c | 27.0°c |
| వరంగల్ | 14.0°c | 28.0°c |
| ఖమ్మం | 14.0°c | 28.0°c |
| మహబూబ్‌నగర్ | 16.2°c | 28.5°c |
| నల్లగొండ | 17.6°c | 27.5°c |

## వీధి వ్యాపారులపై సర్కారు కన్నెర్ర

- మెట్టుగూడ-తార్నాక రోడ్డులో షాపుల తొలగింపు
- 125 కుటుంబాలను రోడ్డున పడేసిన రేవంత్
- ఉపాధి కరువై గుండెపోటుతో మహిళ మృతి
- ఆదుకోవాలని తెలంగాణ భవన్‌కు బాధితులు

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని వీధి వ్యాపారులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రోడ్డున పడేస్తున్నది. ఉపాధి లేకుండా చేసి చిరువ్యాపారులను వేధింపులకు గురి చేస్తున్నది. నగరంలోని మెట్టుగూడ-తార్నాక రోడ్డుకు ఇరువైపులా బట్టలు, పండ్లు, భోజనం అమ్ముకుంటున్నవారి దుకాణాలు తొలగించింది. దీంతో 125 కుంటుంబాలకు ఉపాధి కరువైంది. దుకాణం నిర్వహించడానికి తెచ్చిన అప్పు కట్టలేక లలిత అనే మహిళ గుండెపోటుతో మరణించింది. ఉపాధి కల్పించి ఆదుకోవాల్సిన ప్రభుత్వమే వారిని రోడ్డున పడేయడంతో.. బాధితులు ఆదివారం తెలంగాణ భవన్‌కు వచ్చి తమ గోడును వెళ్లబోసుకున్నారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్‌వెండర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తరఫున వినతిపత్రం అందజేశారు. తాము వ్యాపారం కొనసాగించుకునేలా సాయం చేయాలని విన్నవించారు. తమను ఆదుకోవాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డిని కలిసి విన్నవించినా వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమకు ఉపాధి లేకుండా చేసి ఇబ్బందుల పాలు చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యాపారం చేసుకున్నామని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం తమను స్ట్రీట్ వెండర్స్‌గా గుర్తించి వీధి వ్యాపారుల చట్టం కింద గుర్తింపు కార్డులు కూడా జారీ చేసినట్టు పేర్కొన్నారు. తమకు శిక్షణతోపాటు రుణాలు కూడా ఇచ్చినట్టు గుర్తుచేశారు. పోలీసులకు ఈ వివరాలన్నీ పత్రాలతో సహా చూపించినా తమ దుకాణాలను తొలగించారని ఆవేదన వ్యక్తంచేశారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు బీ స్వప్న, ఉపాధ్యక్షుడు ఖాదర్ అలీ, జనరల్ సెక్రటరీ రమేశ్, జాయింట్ సెక్రటరీ లక్ష్మి, కొండయ్య, రమేశ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ గ్రూప్ మీద అంత ప్రేమేంది?!

మొదటిపేజీ తరువాయి...

అటునుంచి ఢిల్లీకి చేరుకునే సరికి, భట్టి విక్రమార్క తన ఢిల్లీ టూర్ ముగించుకొని హైదరాబాద్‌కు తిరిగి రావడం వెనుక రహస్యం ఏమిటంటూ కాంగ్రెస్ నేతల్లో ఆసక్తికర చర్చ జరుగుతున్నది. ముఖ్యమంత్రి కంటే ముందే ఢిల్లీకి వెళ్లిన భట్టి విక్రమార్క.. రాహుల్‌గాంధీని కలవడం, పనిగట్టుకొని ఢిల్లీ మీడియాను పిలిచి రాహుల్‌గాంధీని తాను కలవలేదని చెప్పడంతో అసలు ఏమి జరిగి ఉంటుంది? అని ఆ పార్టీ శ్రేణులను ఆరా తీయగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

### భట్టిని పిలిపించుకున్న రాహుల్!

భట్టి విక్రమార్క కంటే ముందు మంత్రి సీతక్క ఢిల్లీకి వెళ్లారు. ఆమె కోరిన వెంటనే రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. ఆయన తరువాత భట్టి వెళ్లారు. వీరికి ప్రత్యేకంగా ఢిల్లీ నుంచి పిలుపు వచ్చిందా? లేక వీరంతట వీరే వెళ్లి రాహుల్‌గాంధీని కలిశారా? అనే అంశం మీద పార్టీ శ్రేణులు ఆరా తీయగా.. భట్టి విక్రమార్కను అధినేతే పిలిపించినట్టు ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో రాష్ట్రంలో జరుగుతున్న పరిపాలనా తీరును రాహుల్‌గాంధీ అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ప్రధానంగా మల్టీనేషనల్ వ్యాపారవేత్తతో రాష్ట్ర ముఖ్య నేతకు ఉన్న అనుబంధం, రాష్ట్రంలో ఆ.. గ్రూప్ పెట్టుబడులు, వ్యాపార లావాదేవీల మీద వివరాలు అడిగినట్టుగా విశ్వసనీయంగా తెలిసింది. ఫ్యూచర్‌సిటీలో ఏమి జరుగుతున్నదని, అక్కడ ఆ.. గ్రూప్‌ను ఎందుకు ఇన్‌వాల్వ్ చేశారని ఆరా తీసినట్టు తెలిసింది. నల్లగొండ జిల్లాలో సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టాలనే ప్రతిపాదనలు ఎవరి ద్వారా వచ్చాయని, ప్రజా తిరుగుబాటు వస్తున్నా ఎందుకు మొండిగా ముందకెళ్తున్నారని, అసలు దావోస్ మీటింగ్‌లో ఏమి జరిగిందనే అంశాలపై రాహుల్‌గాంధీ అడిగినట్టుగా తెలిసింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆ..గ్రూప్‌కి యాంటీగా స్టాండ్ తీసుకున్న నేపథ్యంలో తెలంగాణలో ఆయనంటే మనకెందుకు ప్రత్యేకమని అడిగినట్టు తెలిసింది.

### ఢిల్లీ పరిణామాలపై పార్టీలో ఉత్కంఠ

కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టటానికే సీఎం రేవంత్‌రెడ్డి 28వ సారి ఢిల్లీకి వెళ్లారని సీఎంవో వర్గాలు మీడియాకు లీకులు ఇస్తున్నాయి. కాంగ్రెస్ అనుకూల మీడియాలో కూడా సీఎం నిధులు రాబట్టడం కోసమే ఢిల్లీ టూర్ వెళ్లారనే అంశాన్నే హైలెట్ చేశారు. నిజంగా నిధుల కోసమే అయితే రాష్ట్ర ఆర్థిక మంత్రిగా భట్టి విక్రమార్క కూడా సీఎంతో పాటు వెళ్లాల్సి ఉంటుందని, ఆర్థికమంత్రి లేకుండా నిధుల సమీకరణ అంశం ఏమి ఉంటుందని గాంధీభవన్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కాగా, రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ కోసం ముఖ్యమంత్రి మూడు రోజులు ఎదురుచూసినా ఆయనతో ముఖాముఖి దొరకలేదనీ, చేసేదేమీలేక ఆయన సైలెంట్‌గా హైదరాబాద్ తిరిగొచ్చారనే ప్రచారం జరుగుతున్నది. గతంలో ఢిల్లీకి వెళ్లినప్పుడు కూడా రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ దొరకలేదట! కానీ ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను రాహుల్ పిలిపించి మాట్లాడినట్టు తేలడంతో కాంగ్రెస్ పార్టీలో ఏమి జరుగుతున్నదనే ఉత్కంఠ మొదలైంది.



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో బీఆర్‌ఎస్ నేతలు బాల్క సుమన్, ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నాయకుడు రవీందర్‌రెడ్డి

# హాస్టళ్లపై చర్చకు సిద్ధమా?

- అమరవీరుల స్థూపం వద్దకు రండి
- రేవంత్‌రెడ్డీ.. చర్చకు మీరు రెడీనా?
- మెస్, కాస్మెటిక్ చార్జీలను మేమే పెంచాం
- కాంగ్రెస్ ఏడాది పాలనలో 53 మంది చనిపోయారు
- గురుకుల బాట రిపోర్టుతో సర్కారు వెన్నులో వణుకు
- అందుకే పిల్లలతో హాస్టళ్లలో కాంగ్రెస్ మంత్రుల పిక్నిక్
- బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- బీఆర్‌ఎస్ నిలదీస్తుందనే భయం: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్
- గురుకులబాటతో ప్రభుత్వం దిగొచ్చింది: బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ హయాంలో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల స్థితిగతులపై, నేటి కాంగ్రెస్ పాలనలో ఉన్న స్థితిగతులపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్‌ఎస్ నేత డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ సవాల్ విసిరారు. 'నేను పూర్తి డాటా తీసుకొస్తా.. మీరూ తీసుకురండి.. తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద చర్చిద్దాం.. ఇందుకు మీరు రెడీనా?' అని ప్రశ్నించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ నేతలు బాల్క సుమన్, ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నాయకుడు రవీందర్‌రెడ్డితో కలిసి ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలోనే సన్నబియ్యంతో వారానికి రెండు సార్లు మటన్, నాలుగుసార్లు చికెన్, ఐదు కోడిగుడ్లు పెట్టామని చెప్పారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషియన్ ఆదేశాల మేరకు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించామని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విద్యార్థులు విషతుల్య ఆహారం తిని అస్వస్థతకు గురవుతున్నారని, ఏడాది పాలనలోనే 53 మంది విద్యార్థులు చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ ఫైవ్‌మెన్ కమిటీ ఆధ్వర్యంలో గురుకుల బాట నిర్వహించామని, క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలతో నివేదికను పార్టీ అధినేత కేసీఆర్‌కు సమర్పించామని చెప్పారు. బీఆర్‌ఎస్‌ఎల్పీలో నివేదికపై చర్చించామని, సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో గురుకులాలు, హాస్టళ్ల దుస్థితిపై బీఆర్‌ఎస్ నిలదీస్తుందని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెన్నులో వణుకు పుట్టిందని, ఆ భయంతోనే శనివారం సీఎంతోసహా మంత్రులు విద్యార్థులతో పిక్నిక్ కార్యక్రమం నిర్వహించారని మండిపడ్డారు. గురుకుల బాటలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను సేకరించామని చెప్పారు. గురుకుల బాటకు వెళ్తే తమపై కేసులు పెట్టారని, పాఠశాలలకు వెళ్లకుండా బోర్డులు పెట్టించారని తెలిపారు. మంత్రులు వచ్చిన రోజు తల్లులనే అనుమతించాలని ప్రభుత్వం ప్రిన్సిపాళ్లకు మెసేజ్ పంపిందని విమర్శించారు. తన నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఎందుకు ఆహ్వానించలేదని నిలదీశారు.

### బీఆర్‌ఎస్ హయాంలోనే డైట్ చార్జీల పెంపు

2017లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే డైట్ చార్జీలను రూ.1,500కు పెంచామని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గుర్తుచేశారు. పిల్లలకు సన్నబియ్యం, మటన్, చికెన్, కోడిగుడ్లతో నాణ్యమైన భోజనం అందించామని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో ఉన్న మెనూకు కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ప్రకటించిన మెనూకు ఏమీ తేడా లేదని స్పష్టంచేశారు. 2023లో డైట్ చార్జీలు మళ్లీ పెంచడానికి సబ్ కమిటీ వేశామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్యక్రమాలను కాపీ పేస్ట్ చేస్తున్నదని పేర్కొన్నారు. కేటీఆర్ గురుకుల బాటకు పిలుపునివ్వడం వల్లే మంత్రులు హాస్టళ్ల బాట పట్టారని తెలిపారు. నిన్న చిలుకూరులో రేవంత్ ముందు విద్యార్థులు కనబరిచిన ప్రతిభాపాటవాలు కేసీఆర్ హయాంలో తీసుకున్న చర్యల ఫలితమేనని చెప్పారు.

### దున్నపోతుపై వానపడిన చందం

రాష్ట్రంలో ఒకవైపు విద్యార్థులు చనిపోతుంటే, దున్నపోతుపై వానపడిన చందంగా ప్రభుత్వం తీరు ఉన్నదని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో గురుకుల సమస్యలపై బీఆర్‌ఎస్ నిలదీస్తుందనే భయంతో మంత్రులు తూతూమంత్రంగా గురుకులాలకు వెళ్లారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల పట్ల చిత్తశుద్ధి లేదని తెలిపారు. గురుకుల బాటతో కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచామని బీఆర్‌ఎస్ నేత డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ చెప్పారు. కేటీఆర్ సూచించిన విధంగా గురుకుల బాట చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చిందని తెలిపారు.

### మరో ఇద్దరికి అస్వస్థత

*తాండూరు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థినులు వైశాలి, రక్షిత ఆదివానం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వారిని తాండూరులోని దవాఖానకు తరలించారు. ఇప్పటికే అక్కడ తొమ్మిది మంది విద్యార్థినులు చికిత్స పొందుతుండగా...ఎవరూ పూర్తిగా కోలుకోలేదని సమాచారం. గురుకుల ఆశ్రమ పాఠశాల వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగుతున్నది. పాఠశాల, హాస్టల్‌లోని పాత సరుకులను తొలగించి కొత్తవి తీసుకొచ్చినట్టు విద్యార్థినులు తెలిపారు.*

– తాండూరు



## మున్నూరుకాపులు ఐక్యంగా అభివృద్ధి చెందాలి

**రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర • అమీనాపురంలో ఎంకే కన్వెన్షన్ ప్రారంభం**

కేసముద్రం, డిసెంబర్ 15: మున్నూరుకాపులు ఐక్యంగా అభివృద్ధి చెందాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సూచించారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అమీనాపురంలో ఆదివారం ఎంకే కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభించి మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ మున్నూరుకాపులను గుర్తించి పది మందికి ఎమ్మెల్యే అభ్యర్థులుగా టికెట్లు కేటాయించారని గుర్తుచేశారు. మున్నూరుకాపులు ఐక్యంగా ఫంక్షన్‌హాల్ నిర్మించుకోవడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు వీ హనుమంతరావు, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మహబూబాబాద్, వరంగల్ తూర్పు, పశ్చిమ మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్ నాయక్, నన్నపునేని నరేందర్, దాస్యం వినయభాస్కర్, రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య, నాయకులు పాల్గొన్నారు.



ఎంపీ రవిచంద్రకు జ్ఞాపికను అందిస్తున్న మున్నూరుకాపులు

## పట్టువీడని ఎస్ఎస్ఏ ఉద్యోగులు

- ఆరు రోజులుగా సమ్మె
- పట్టించుకోని ప్రభుత్వం
- ఎన్నికల ముందు ఇచ్చిన హామీని మరిచిన ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): 'మీ సమస్యలపై మాకు సంపూర్ణ అవగాహన ఉన్నది. ప్రభుత్వం అనుకుంటే గంటలో మీ సమస్యలు పరిష్కారమైతయి. మిమ్మల్ని సచివాలయంలో కూర్చోబెట్టి మీరు చాయ్ తాగేలోపల జీవో ఇవ్వవచ్చు. మేం అధికారంలోకి రాగానే మీ సంఘాల నాయకులను సచివాలయానికి పిలిపించి సమస్యలను పరిష్కరిస్తాం'. ఇదీ ఎన్నికల సమయంలో హనుమకొండలో నిర్వహించిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల ధర్నాలో రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు. కానీ, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎస్ఎస్ఏ ఉద్యోగులను సచివాలయానికి పిలిచింది లేదు.. సమస్యలను పరిష్కరించింది లేదు. దీంతో ఆగ్రహించిన ఉద్యోగులు తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన బాటపట్టారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా 25 రోజులపాటు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందిరాపార్క్‌లో భారీ ధర్నా నిర్వహించారు. ఆ తర్వాత సమ్మె నోటీసులు అందజేశారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. సమ్మె ఆరు రోజులుగా కొనసాగుతున్నది. డిమాండ్లను నెరవేర్చేవరకు సమ్మె కొనసాగుతుందని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీ యాదగిరి, జీ ఝాన్సీసౌజన్య ప్రకటించారు.

### ఇచ్చిన హామీని నెరవేర్చాలి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఏడాదిగా హామీ నెరవేరుతుందని ఎదురుచూశాం. కానీ, మాకు నిరాశే మిగిలింది. దీంతో మళ్లీ రోడ్డున పడ్డాం. ఆరు రోజులుగా సమ్మె చేస్తున్నాం. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

– ఎస్ వీణ, ప్రత్యేకాధికారి, నర్సాపూర్, నిర్మల్

### కాంగ్రెస్ మోసం చేసింది

మమ్మల్ని రెగ్యులరైజ్ చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసం చేసింది. వంద రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీఇచ్చి ఏడాది గడిచినా పట్టించుకోవట్లేదు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించం. 20 వేల కుటుంబాలు రోడ్డు మీదికి వచ్చాయి. ఇప్పటికైనా మాకు న్యాయం చేయాలి.

– పడాల రవీందర్, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం అధికార ప్రతినిధి

### ప్రధాన డిమాండ్లు..

- ఉద్యోగులందరిని రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో విలీనం చేయాలి
- తక్షణమే పేస్కేల్ కల్పించి ఉద్యోగ భద్రతకు భరోసా ఇవ్వాలి
- రూ.10 లక్షల చొప్పున జీవిత బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి
- రిటైర్డ్ అయిన వారికి బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు చెల్లించాలి
- ప్రభుత్వ నియామకాల్లో ఉద్యోగులకు వెయిటేజీ అమలుచేయాలి
- పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లకు కూడా రాష్ట్ర ప్రభుత్వం 12 నెలల వేతనమివ్వాలి